లంబాడాలకు కాంగ్రెస్ ద్రోహం

- గిరిజనులంటే రేవంత్‌రెడ్డికి చిన్నచూపు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి
- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్

మాట్లాడుతున్న భీమానాయక్

మహబూబాబాద్ రూరల్, జూన్ 8 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ లంబాడాలకు ద్రోహం చేస్తున్నదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో లంబాడా జాతి ఓట్లు వేస్తేనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, గెలిచిన తర్వాత లంబాడాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ మంత్రి వర్గంలో లంబాడాలకు మంత్రి పదవి ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి చిన్న చూపు చూడడం సరైంది కాదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో లంబాడాలంతా ఏకతాటి పైకి వచ్చి కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి ముఖ్యమంత్రి ఉంటే లంబాడాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఎలాంటి అభివృద్ధి జరగదన్నారు. లంబాడాలకు వెంటనే మంత్రి పదవి ఇవ్వాలని నేడు అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలపాలన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

కురవి, జూన్ 8 : మండలంలోని రాజోలు గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు, గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పరామర్శించారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అదేవిధంగా మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అల్లూరి వీరభద్రరాజ్(చంటి) అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించారు. తట్టుపల్లి చంద్యాతండా మాజీ ఎంపీటీసీ భూక్యా జామానాయక్ తండ్రి సుందర్ మృతిచెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో బజ్జూరి పిచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు తోట లాలయ్య, గుగులోత్ రవి, రమేశ్, బాదె నాగయ్య పాల్గొన్నారు.



మదనతుర్తిలో మార్కండేయ ఆలయ ప్రతిష్టాపన ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్

నెల్లికుదురు, జూన్ 8 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని మానుకోట ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. మండలంలోని మధనతుర్తి గ్రామంలో పద్మశాలీ కులస్తుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా పార్వతీపరమేశ్వర, గణపతి, సుబ్రహ్మణ్య, నందీశ్వర, మార్కండేయస్వామి విగ్రహాల ప్రతిష్టాపన వేడుకలు జరుగుతున్నాయ. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం గ్రామ అధ్యక్షుడు అనపర్తి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కొప్పు జనార్దన్ , కొప్పు శ్రీనివాస్, విగ్రహదాత కొప్పు కరుణాకర్, నాయకులు సత్య పాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

సోనియాకు సన్మానం

సోనియాను సన్మానిస్తున్న ఐఏఎస్ గుగులోతు రవి

మరిపెడ, జూన్ 8 : ఇటీవల ప్రకటించిన జేఈఈ ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో ఆల్ ఇండియా 63వ ర్యాంకు సాధించిన సోనియాను ఆదివారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి, ఐఏఎస్ గుగులోత్ రవి సన్మానించారు. ఆమె సొంత గ్రామమైన తండా ధర్మారానికి వచ్చి అభినందించారు. అనంతరం ఐఏఎస్ ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని అది సాధించాడానికి కష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ నరేందర్, కిషన్, నీలా, జమ్లా, భగవన్య, శ్రీను, తండవాసులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమా? మామూళ్లా ?

- ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని మూడింటిని వదిలేయడంపై స్థానికంగా చర్చ
- బేరమెంతో కుదిరిందోనని విమర్శలు
- సోషల్ మీడియాలో వైరల్

ఆకేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

తహసీల్ కార్యాలయం నుంచి బయటకు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

నర్సింహులపేట, జూన్ 8 : మండలంలోని ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఒకవైపు వినిపిస్తుండగా, మరోవైపు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు పట్టుకున్న కొందరు అధికారులు వాటిలో మూడింటిని వదిలేశారనే ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా, పట్టుకొని వదిలేసిన ఇసుక ట్రాక్టర్లకు బేరమెంత కుదిరిందోనని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని బక్కతండా శివారు ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీసులు కలిసి పట్టుకున్నారు. వాటిలో మూడు ట్రాక్టర్లను వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలవారీగా మామూళ్ల ఇచ్చే, అధికారం ఉన్న వారి ఇసుక ట్రాక్టర్ల యజమానులకు ముందుస్తు సమాచారం ఇవ్వడంతో వారు వాగులోకి వెళ్లకపోవడం, అదే సమయంలో అధికారులు తనిఖీలకు వెళ్లి వాగులో ఉన్న ట్రాక్టర్లను పట్టుకొచ్చి కేసులు పెడుతున్నారు. కానీ, మామూళ్లు ఇచ్చే వారు ముందుస్తు సమాచారంతో అధికారులు తనిఖీకి వెళ్లని సమయంలో జోరుగా ఇసుకను తరలించి కొందరి ఇండ్లలో డంప్ చేస్తున్నా సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. అయితే, పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను కూడా కొందరు అధికారులు మామూళ్లకు అలవాటు పడి కార్యాలయం నుంచి బయటకి పంపించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల అధికారులు పట్టుకున్న ఐదు ఇసుక ట్రాక్టర్లలో మూడు ట్రాక్టర్లు వదిలేశారని, వదిలేయడం వెనుక మర్మం ఏంటని స్థానికంగా చర్చ జరుగుతున్నది. ఉదయం 7 నుంచి రాత్రి 8 వరకు బడా నాయకుల ఐదు ఇసుక ట్రాక్టర్లు నడుస్తున్నా ఎందుకు పట్టుకోవడం లేదని, 'అధికారుల నిర్లక్ష్యమా.. మామూళు మత్తులోనా'.. అనే పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ విషయంపై తహసీల్దార్ రమేశ్‌బాబు మాట్లాడుతూ.. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు ఎవరు వదిలేశారు. దీని వెనక రెవెన్యూ సిబ్బంది ఎవరున్నారనే దానిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అక్రమ రవాణపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేహశ్రీకి కన్నీటి వీడ్కోలు

- ఊరంతా శోకసంద్రం
- కడచూపునకు నోచుకోని తల్లి...
- ఖమ్మం ఆస్పత్రిలో తల్లి సరిత

కురవి: నేహశ్రీ అంతిమయాత్రలో పాల్గొన్న జనం

కురవి, జూన్ 8 : కురవి మండల కేంద్రానికి చెందిన తొడుసు నేహశ్రీ(15) శనివారం సాయంత్రం మండల కేంద్ర శివారు లింగ్యాతండా వద్ద 365 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆమె తల్లి సరిత అపస్మారక స్థితిలోకి చేరగా, కుటుంబ సభ్యులు ఖమ్మం జిల్లాలోని ఓ హాస్పిటల్ చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ విషాద ఘటన కురవి గ్రామాన్ని విషాదంలో ముంచింది. కుమార్తె నేహ మృతి చెందిన వార్త తెలియగానే తండ్రి వెంకన్న కూడా అపస్మారక స్థితిలోకి చేరడంతో ఆ కుటుంబంలో మరింత విషాదం నెలకొంది. అటు తల్లి సరిత కుమార్తెను కడచూపునకు కూడా నోచుకోలేదు. కనీసం తల్లికి కుమార్తె మరణ వార్త కూడా తెలియదు. ఆదివారం నిర్వహించిన అంత్యక్రియలకు గ్రామస్తులు, బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చి కన్నీటి వీడ్కోలు తెలిపారు. మరోరెండు రోజుల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో జాయిన్ కావల్సిన నేహశ్రీ చిన్న వయస్సుల్లోనే ఆకస్మికంగా మృతిచెందడంతో ఊరం తా తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించింది. వాస్తవానికి కురవిలో యాదవ కులస్తుల ఆరాధ్యదైవమైన గంగమ్మ జాతర ఉండడంతో బంధువులు పెద్ద సంఖ్య లో గ్రామానికి వచ్చారు. దీంతో గంగమ్మ జాతరను కూడా యాదవ కులపెద్దలు రద్దు చేసుకున్నారు. వచ్చిన బంధువులు నేహశ్రీ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

కన్నీటి పర్యంతమైన రెడ్యా

బంగారు భవిష్యత్ ఉన్న నేహశ్రీ మృతిచెందిన విషయం తెలియగానే డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆమె మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యా డు. నివాళులర్పించారు. తండ్రిని ఓదార్చి తల్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, తోట లాలయ్య, బాదె నాగయ్య, గుగులోత్ రవి, నూతక్కి నర్సింహారావు, సాంబశివరావు, మేక నాగిరెడ్డి, దుడ్డెల వినోద్ ఉన్నారు. నేహశ్రీ మృతదేహాన్ని పార్టీలకతీతంగా నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఎర్ర నాగేశ్వర్‌రావు, నారాయణ రాజేందర్‌కుమార్, కర్నం రాజన్న అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పెద్దచెరువు మరమ్మతు పనులు చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు.

బయ్యారం, జూన్ 8 : పాలకుల నిర్లక్ష్యమే పెద్ద చెరువుకు శాపంగా మారిందని, కాల్వల శాశ్వత మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని అఖిలపక్షం నాయకులు గౌని ఐలయ్య, మండ రాజయ్య, ముల్కరి జగ్గన్న, సారిక శ్రీను డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన వామపక్షాల సమావేశంలో వారు మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లు బయ్యారం చెరువుకు రావాల్సి ఉన్నా పాలకులు అడ్డుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై రైతులు దుక్కులు దున్నుతున్నారని, బయ్యారం చెరువు కాల్వలు, తూములు శిథిలావస్థలో ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారని అన్నారు. ఏటా మొక్కుబడిగా పనులు చేయడమే తప్ప శాశ్వత మరమ్మతు పనులు చేపట్టడం లేదని, ఫలితంగా నీళ్లు వృథాగా పోతున్నాయన్నారు. బయ్యారం చెరువుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందించి, బ్యాలెన్స్ రిజర్వాయర్‌గా మార్చాలన్నారు. కాల్వకు శాశ్వత ప్రాతిపదిక మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. పెద్ద చెరువు అభివృద్ధి కోసం ఈ నెల 13న ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, నంబూరి మధు, తుడుం వీరభద్రం, కళింగరెడ్డి, తోకల వెంకన్న, రామచంద్రుల మురళి, ఏపూరి వీరభద్రం పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు.
మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777135 MULUGU
9182777135 MAHABUBABAD
9182777557 JANGAON
9182777565

పెద్దవంగర: అవుతాపురం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దవంగర, జూన్ 8 : మండలంలోని అవుతాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'సిల్వర్ జూబ్లీ' పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సరదాగా గడిపారు. నాటి గురువులు మూర్తి, శ్రీనివాస్, శ్యాంసుందర్, రవీందర్‌ను సన్మానించారు. కార్యక్రమం లో పూర్వవిద్యార్థులు శ్రీనివాస్, రమేశ్, ప్రసా ద్, సునీల్, ప్రవీణ్, సంపత్, రాజు, రా మ్మూర్తి, కల్పన, హేమ, యాకలక్ష్మి, సరిత, కమల, భవాని, హల్యా, అశోక్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్ : డోర్నకల్ నిర్మల హై స్కూల్‌లో 1999-2000 వ సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాలు తర్వాత ఒకే వేదికపై కలుసుకుని చిన్నానాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనాటి ఉపాధ్యాయులు సత్యనారాయణ, రంజిత్ ,వెంకటేశ్వర్లు, గీత, ప్రకాశమ్మ. నిర్మలను ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం నిర్మల హైస్కూల్ ప్రిన్సిపాల్ పుష్పను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోరగల్ల శరత్ బాబు, బడేటి ఉపేందర్, కొత్త వంశీ, గురుస్వామి, స్వరూప, సంధ్య పాల్గొన్నారు.

డోర్నకల్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సాగు నీరు అందించేందుకు కృషి చేస్తాం..

డోర్నకల్, జూన్ 8: మున్నేరు ద్వారా మండల రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని మున్నేరు పరివాహక ప్రాంతాలను పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. మున్నేరు ద్వారా ముల్కనూరు, గుంపెళ్లగూడెం ప్రాంతం రైతులకు సాగునీటిని తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామారావు, నాగేశ్వరావు, కట్టా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్నేరు పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

స్వాతంత్ర్య సమరయోధుడికి సన్మానం

స్వాతంత్ర్య సమరయోధుడు కొమురయ్య శత దినోత్సవ వేడుకలు మండల కేంద్రంలోని వర్ధక సంఘం భవనంలో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య కొమురయ్యను ఘన సన్మానించారు.

ఉపాధి పథకంపై కుట్రలను నిలిపివేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరాములు

తొర్రూరు, జూన్ 8 : ఉపాధి పథకంపై కేంద్రం కుట్రలను నిలిపివేయాలని బీకేఎంయూ (భారత వ్యవసాయ కార్మిక సంఘం) జాతీయ కార్యవర్గ సభ్యుడు టీ వెంకటరాములు, రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తొర్రూరు లయన్స్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన 3వ మహాసభలో వారు మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు ఏటా 200పనిదినాలు, రోజుకు రూ. 600 చొప్పున వేతనం కల్పించాలన్నారు. అలాగే, పథకానికి రూ.4లక్షల కోట్లు బడ్జెట్, మరణించిన కూలీకి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, 50ఏళ్ల పైబడిన కూలీలకు నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా బీకేఎంయూ మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్టెబోయిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చింతకుంట్ల వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గణపురం లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ సభలో సీపీఐ నాయకులు అజయ్ సారధిరెడ్డి, తమ్మెర విశ్వేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో భక్తుల సందడి

కురవి, జూన్ 8 : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది.పాఠశాలలకు సెలవులు ముగుస్తుండడం, వానకాలం ప్రారంభం కానుండడంతో భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరారు. స్వామి, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

కురవి వీరభద్రుడి ఆలయ ప్రాంగణంలో భక్తులు

కురవి: చేపల అమ్మకం చేస్తున్న లైవ్‌ఫిష్ వ్యాపారి

చేపలకు మస్తు గిరాకీ

కురవి, జూన్ 8 : మృగశిరకార్తె రోజున తప్పనిసరిగా చేపలను తినడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ మేరకు ఆదివారం మృగశిర కార్తె కావడంతో కురవి, సీరోలు మండలాల్లో చేపల వ్యాపారం జోరుగా సాగింది. చేపలను గంపల్లో పోసుకొని ఇంటింటికీ తిరిగే అమ్మకాలు చేపట్టారు. రేటు పెరిగినా ప్రజలు చేపలను కొనడానికి వెనకాడలేదు.

ప్రైవేట్ విద్యా సంస్థల దోపీడీని అరికట్టాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 8 : ప్రైవేట్ విద్యా సంస్థల దోపీడీని వెంటనే అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతం డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజల నుంచి ప్రైవేట్ విద్యా సంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండడంతో ఫీజుల దోపిడీని నియంత్రించి, అన్ని ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్, రామ్, చరణ్, రవి, మహేశ్, ఓంకార్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కేసముద్రం : ధన్నసరి గ్రామానికి చెందిన కొండ నాగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన చిన్ననాటి స్నేహితులు ఆదివారం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. నాగయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రూ.21వేలను నాగయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిగిరి చిన్న సాంబయ్య, జక్కుల ఉదయ్, కళింగరాజు పాల్గొన్నారు.

సాగు నీరు అందించాలి

గార్ల, జూన్ 8: ఇల్లందు, డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాలకు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా సాగునీరు అందించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అఖిల పక్ష నాయకులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ప్రాజెక్టును రీడిజైన్ చేసిన లిఫ్ట్ ఏర్పాటు చేసి పంట పొలాలకు రెండు విడతలకు నీరు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని బాలిక మృతి..

పెద్దవంగర, జూన్ 8 : టిప్పర్ ఢీకొని బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని బావోజీ తండా జీపీ పరిధిలోని కిష్టు తండాలో ఆదివారం జరిగింది. ఎస్సై క్రాంతి కిరణ్ కథనం ప్రకారం.. కిష్టుతండాకు చెందిన జాటోత్ ఇందుమతి(11) ఎన్‌హెచ్- 930-పీ పక్కనే నిర్మాణంలో ఉన్న సర్వీస్ రోడ్డుపై నుంచి సైకిల్ తొక్కుకుంటూ వెళ్తున్నది. ఈ క్రమంలో వెనక వైపు నుంచి టిప్పర్ అతివేగంగా ఢీ కొనడంతో బాలికకు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతికి కారణమైన ఝార్ఖండ్ రాష్ట్రం దేవోఘర్ జిల్లా మదాపూర్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ కాండేవ్ రేవనిపై మృతురాలి తండ్రి జాటోత్ సోమన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని తొర్రూరు సీఐ గణేశ్ పరిశీలించారు.

థర్డ్ జెండర్లపై '100'కి ఫిర్యాదు

కేసముద్రం, జూన్ 8 : మామూలు ఇవ్వాలని పెళ్లి కొడుకును ఇబ్బందిపెడుతున్న థర్డ్‌జెండర్‌పై డయల్ 100కి ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. హరిహర గార్డెన్‌లో జరుగుతున్న పెండ్లిలో పెండ్లి కొడుకును రూ.5వేలు మామూలు ఇవ్వాలని థర్డ్ జెండర్లు కోరగా, నిరాకరించాడు. దీంతో థర్డ్ జెండర్లు పెళ్లి కొడుకు, అతడి తండ్రిపై శాపనార్థాలు పెడుతూ ఇబ్బందులకు గురి చేయగా, పెండ్లి కొడుకు డయల్ 100కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై మురళీధర్‌రాజును వివరణ కోరగా డయల్ 100కి ఫోన్ చేయడంతో వెంటనే పోలీసులు ఫంక్షన్ హాల్‌కు వెళ్లగా అక్కడ ఎవరూ లేరని తెలిపారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా రడం శ్రీనివాస్

కేసముద్రం, జూన్ 8 : మండలంలోని కేసముద్రం విలేజ్ గౌడ సంఘం అధ్యక్షుడిగా రడం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కదిర శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా పెదగాని సురేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా ఉట్కూరి శ్రీనివాస్‌గౌడ్, గాజగోని వీరన్న గౌడ్, చింతనూరి సతీశ్‌గౌడ్, రవి శంకర్‌గౌడ్, సహాయ కార్యదర్శిలుగా మచ్చిక అశోక్‌గౌడ్, సలహాదారులుగా రడం పెద్ద వెంకన్నగౌడ్, రడం చిన్న వెంకన్న, చిర్ర యాకాంతం గౌడ్, ఉట్కూరి అశోక్ గౌడ్, కొత్త శ్రీనివాస్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

ఐదు ఎకరాల్లో జమాయిల్ తోట దగ్ధం

డోర్నకల్, జూన్ 8 : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని జమాయిల్ తోట దగ్ధమైన ఘటన గుర్రాలకుంట తండా సమీపంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన జే రమేశ్‌కు గుర్రాలకుంటతండా సమీపంలో 15ఎకరాలు జమాయిల్ తోట ఉన్నది. ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నది. దీంతో 5ఎకరాలు తోట కాలిపోయింది. స్థానిక రైతులు మంటలను ఆర్పివేశారు.

ప్రమాదవశాత్తు కట్టెలకు నిప్పు

కురవి, జూన్ 8 : మండల కేంద్రంలోని పెట్రోల్‌బంకు పక్కన ఖాళీ స్థలంలో ఉన్న కట్టెలకు ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. అగ్నికీలలు ఎగిసిపడి నిప్పురవ్వలు పెట్రోల్ బంకుపై పడే అవకాశం ఉండడంతో అప్రమత్తమైన బంకు సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. హుటాహుటిన అగ్నిమాపక శాఖ అధికారులు ఫైరింజన్‌తో వచ్చి మంటలను ఆర్పివేశారు.

ప్రభుత్వ బడిలో చేర్పించండి..

డోర్నకల్, జూన్ 8 :విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్ అన్నారు. ఆదివారం చిల్కోడులో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుంకర శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

కురవిలో..

కురవి: మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, హెచ్ఎం వాహీద్ ఆదివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించారు. నాణ్యమైన విద్య అందాలంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమవుతుందని, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు.

చిల్కోడులో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు